25

# అన్యజనుల మధ్య పౌలు చేసిన సువార్త ప్రయాణాలు

క్రీ.శ. 45-58 (అపొ. 13-21:26)

## I. మొదటి ప్రయాణం. (అపొ. 13, 14.)

**1. మిషనరీ ఉత్సాహ శక్తి.** – ఒక సంవత్సరంపాటు పౌలు బర్నబాలు కలిసి అంతియొకయలో పని చేశారు. సంఘము సంఖ్యలో బహుగా అభివృద్ధి చెందింది. ప్రాముఖ్యమైనదేమంటే, ఆత్మ సంబంధమైన అభివృద్ధి. యెరూషలేములో అవసరతలో ఉన్న తమ సహోదరులకు ఉపకార ద్రవ్యాన్ని బర్నబా పౌలులచే పంపడం ద్వారా వారి దాతృత్వాన్ని కనుపరుచుకున్నారు (అపొ. 11:27-30). ఉపదేశకులలో కూడ అది ఐశ్వర్యవంతమైనదై (అపొ. 13:1) యుంది, అందులో బర్నబా మొదటివాడుగాను, సౌలు చివరివాడుగాను పేర్కొనబడ్డారు. విస్తృతంగా సువార్త జరిగించాలనేది వారి హృదయముల మీద ఉన్నట్టుంది; ఏలయనగా "వారు ప్రభువును సేవించుచు ఉపవాసము చేయుచుండగా పరిశుద్ధాత్మ – నేను బర్నబాను పౌలును పిలిచిన పనికొరకు వారిని నాకు ప్రత్యేకపరచుడని వారితో చెప్పెను" (అపొ. 13:2). వెలుపలనుండి హింస అనే ఒత్తిడివలన యెరూషలేము సువార్త పనికి కేంద్రం అయ్యింది గాని; అంతియొకయ అయితే పరిశుద్ధాత్మ అంతరంగపు ఉత్సాహ శక్తివలన అలా అయ్యింది.

**2. కుప్రను సందర్శించుట.** – ఏర్పరచుకున్న తొలి పొలము కుప్ర, ప్రధాన స్థలంలో నుండి అది కనబడుతూ ఉంటుంది, అది బర్నబా స్వస్థలం. యెరూషలేమునుండి వారితో కలిసి వచ్చిన మార్కు (అపొ. 12:25), వారితో కలిసి వెళ్లాడు. ఆ ద్వీపానికి తూర్పు తీరాన ఉన్న ప్రాచీన గ్రీకు రాజధాని నగరమైన సలామీలో ప్రసంగించి, అక్కడనుండి పాపు అనే రోమీయుల ముఖ్య పట్టణానికి వచ్చారు, అది పశ్చిమ తీరాన ఉంది. ఇక్కడ సెర్గి పౌలు అను రోమా అధిపతి విశ్వాసియయ్యాడు. బర్‌యేసు అనే ఒక యూదా గారడీ వానివలన అతని మార్పు ప్రతిఘటించబడింది. ఈ క్లిష్ట సమయంలో పౌలు నడిపిస్తాడు. దైవ ప్రేరేపణ, అపొస్తలుని శక్తి అనేవాటిని గూర్చిన ఆత్మ వివేకము కలిగి, ఆ మోసగానిని కఠినముగా గద్దించి, అతని వేషధారణపై దేవుని తీర్పుగా వానికి అంధత్వం కలిగించాడు. ఈ సమయంనుండి సౌలు పౌలని పిలువబడ్డాడు, గుర్తింపబడిన నాయకుడయ్యాడు.

**3. ఆసియాలో ప్రయాణం.** – అక్కడనుండి మిషినెరీలు తమ ప్రయాణాన్ని చిన్న ఆసియా వైపు త్రిప్పారు. కొన్ని సంవత్సరాలు పౌలు తన సొంత రాష్ట్రమైన కిలికియలో జీవించాడు. ఇంతవరకు సందర్శించిన ప్రాంతాలు కిలికియకు వాయువ్యంగా ఉన్నాయి. పెర్గ ఓడరేవు వద్ద మార్కు పనిని విడిచిపెట్టి యెరూషలేమునకు తిరిగి వెళ్లాడు. కరకు కొండల జిల్లాలలో గుండా, "నదులవలననైన ఆపదలలోను, దొంగలవలననైన ఆపదలలోను, నా స్వజనులవలననైన ఆపదలలోను, అన్యజనులవలననైన ఆపదలలోను" (2 కొరింథీ. 11:26), పౌలు బర్నబాలు ముందుకు సాగారు. పిసిదియలోని అంతియొకయ, ఈకొనియ, లుస్త్ర, దెర్బే అనే పట్టణాలలోగుండ సాగిపోయి, ఆ మార్గంలోనే వెనుకకు తిరిగారు. అంతియొకయలోని సమాజమందిరంలో పౌలు ప్రసంగించినది వివరంగా దాఖలు చేయబడింది. యూదుల సమూహముచే నిరాకరింపబడి, అతడు అన్యజనుల వైపు తిరిగాడు. "మొదట యూదునికిని గ్రీసుదేశస్థునికిని కూడ ..." (రోమా 1:16), – అనేది క్రమంగా ప్రతి చోట జరిగింది. వారి పనియంత జనుల మార్పులతోను ఎక్కువ బాధలతోను కూడిందిగా ఉంది. కుంటివానిని బాగుచేసిన లుస్త్రలో వారు తొలుత దేవతలవలె పూజింపబడ్డారు, అటు తరువాత, ఈకొనియనుండి వచ్చిన యూదుల ప్రేరేపణవలన, పౌలు రాళ్లతో కొట్టబడి చనిపోయినట్టు వదిలిపెట్టబడ్డాడు. ఆనందముతో ఉప్పొంగుతూ, క్రొత్త లోకాన్ని కనుగొన్న వారివలె వారు అంతియొకయకు తిరిగి వచ్చి తమ్మును పంపిన సంఘానికి రిపోర్టు యిచ్చారు.

## II. రెండవ ప్రయాణం. (అపొ. 16-18:22.)

**1 మధ్యకాలం; యెరూషలేము వద్ద కూడిక.** – క్రొత్త పరిస్థితులు క్రొత్త ప్రశ్నలకు దారి తీశాయి. యూదులతో ఉన్న దశనుండి సంఘము మరి ఎక్కువగా వృద్ధిపొందింది. అయితే సువార్త యొక్క గంభీరమైన సార్వత్రికతకు యూదులలోనుండి వచ్చిన క్రైస్తవులు ఎదుగుటలో మందకొడిగా ఉన్నారు. కొర్నేలీ సంఘటనలో అన్యజనులు సంఘంలో ప్రవేశించే ప్రశ్న తీరిపోయింది. అయితే వారు సున్నతి పొంది యూదులవ్వనవసరం లేదా? క్రైస్తవ్యం కేవలం యూదా మతం మార్పు చేయబడిన లేక తప్పు దిద్దబడిన ప్రచురణ కాదా? అలాగని యెరూషలేమునుండి అంతియొకయకు వచ్చిన కొందరన్నారు. ప్రశ్న భయంకరమైనది; అంతియొకయ సంఘంలోని శాంతిని అది చెరిచింది, మరియు మిషినెరీల భవిష్యత్ ప్రయాసలకు అది సంబంధించినదై యుంటుంది. ఆ ప్రశ్నతో పౌలు బర్నబాలు యెరూషలేమునకు పంపబడ్డారు. యాకోబు అధ్యక్షత వహించి, పేతురు, పౌలు బర్నబాలను వారిచే ప్రవేశము కలిగియున్న సభలో స్వాతంత్ర్యం పక్షగా ఆ ప్రశ్న తీర్మానించబడింది. అది వేరు విధంగా తీర్మానించబడియున్నట్టయితే క్రైస్తవ్యము ఊయల తొట్టెలోనే చచ్చి ఉండేది.

**2. పౌలు బర్నబాల మధ్య తగవు.** – సభ ముగించిన కొద్ది కాలం తరువాత వారు నాటిన సంఘాలను చూడ పోదామని పౌలు బర్నబాతో అంటాడు. తన మేనల్లుడైన (కొలస్సీ 4:10), మార్కును తోడుకొని వెళ్లదామని బర్నబా అంటాడు. గతంలో అతడు

వారిని వదిలి వెళ్లినందున పౌలు దానికి సమ్మతించలేదు. ఆ సందర్భంగా వారు విడిపోవునంతగా వారి మధ్య వివాదం జరిగింది. మార్కు తిరిగి పౌలుతో చేర్చబడ్డాడని తెలిసికొనడం సంతోషకరం (2 తిమోతి 4:11).

**3. రెండవమారు చిన్న ఆసియాను సందర్శించడం. –** సభనుండి పౌలు బర్నబాలు తిరిగి వచ్చేటప్పుడు, సీల వారి వెంట వచ్చాడు. తన ప్రయాణానికి జతగాడుగా పౌలు అతన్ని కోరుకుంటాడు, మరియు భూ మార్గాన సిరియ, కిలికియల గుండా సంఘాలను దర్శించాలనుకున్నాడు. లుస్త్రలో తిమోతి అనే ఒక యువక శిష్యుని అతడు కనుగొంటాడు. అతని తండ్రి గ్రీసు దేశస్థుడు; అయితే భక్తిగల యునీకే అనే యూదురాలైన తన తల్లిచేతను, లోయ అనే తన అవ్వచేతను అతడు పెంచబడ్డాడు (2 తిమోతి 1:5). అతడు పౌలు తొలి ప్రయాణంలో మార్చబడినవాడనేది నిస్సందేహము, అంతేగాక లుస్త్రలో పౌలు శ్రమలకు అతడు సాక్షి. పౌలు శీలంలో ఉండే ఒక సౌందర్యమైన లక్షణమేమంటే, యవ్వనస్థులైనవారిని తన సొంత జీవితం వైపుకును తన్ను తాను ఉపేక్షించుకొని పని వైపుకును బలంగా ఆకర్షించుకోగలడు; మరియు ఇప్పటినుండి తిమోతి పౌలుతో మిక్కిలి పరిచయముగల జతపనివాడౌతాడు.

ఇంతక ముందు నాటిన సంఘాలను తిరిగి సందర్శించడం కంటె గొప్ప ఆలోచనలు పౌలుకున్నాయి. అందువలన ఫ్రుగియ, గలతీలలో క్రొత్త విజయాలకొరకు నెట్టుకొంటూ వెళ్లాడు. తనకు కలిగియున్న ఆలోచనలకంటే మించిన ఏర్పాటు దేవుడు అతని కొరకు కలిగియున్నాడు; ఇరువైపుల అతనికి కంచెవేసి ఆయన అతనిని త్రోయకు నడిపించాడు. అక్కడ ఒక దర్శనములో, "నీవు మా యొద్దకువచ్చి మాకు సహాయము చేయుమని" (అపొ. 16:9) మాసిదోనియ వాడొకడు అడిగినట్టు కన్పిస్తుంది. పౌలు త్రోయలో నిలుచున్నప్పుడు అది ఎక్కువ అర్థమున్న సమయం. శక్తివంతమైన తన గతమంతటిలో తన వెనుక ఆసియా ఉంది; అతనికి ముందు యూరప్; దానికి దక్షణపు అంచున రోము, ప్రస్తుతపు సర్వశక్తి యొక్క స్వరూపము; అలా ముందుకు ఉత్తరానికి, పడమరకు సాగితే సిథియనులున్నారు వారి నడుములలో అంతకంటే ఎక్కువ శక్తిగల భవిష్యత్తు ఉంది. "నీ (తూటాలు) తుపాకీలు యూరప్ మీదికి త్రిప్పు. భవిష్యత్తును జయించు."

**4. యూరప్‌లో సువార్త నాటబడుతుంది; ఫిలిప్పీ వద్ద ఆరంభించి. –** త్రోయలో, లూకా పౌలుతో జతకూడుతాడు, "మేము" అనే ప్రయోగంవలన ఈ సంగతి తెలుస్తుంది. నెయపొలికి మిషినెరీలు ఓడ ప్రయాణం చేసి, ఆ జిల్లాకు ముఖ్యపట్టణమైన ఫిలిప్పీకి వచ్చారు. ఫిలిప్పీ సైనిక పట్టణమే గాని, వ్యాపార పట్టణం కాదు. అందువలన కొద్దిమంది యూదులే ఉన్నారు, సమాజమందిరం లేదు. అయితే శనివారం స్త్రీల ప్రార్థనా కూడిక నదీ తీరాన ఉంటుంది, పౌలు అక్కడ హాజరయ్యాడు. నది ఒడ్డున జరిగే ప్రార్థనా కూడికలో, యూరప్‌నందు క్రైస్తవ్యము తన ఉత్పత్తి చేసే పనిని ఆరంభించినది, మరియు లూదియ అను వ్యాపారపు స్త్రీ దాని తొలి ఫలమైయుంది. త్వరలోనే దయ్యము పట్టిన దాసి పిల్లవలన ఆ వీధుల్లో మిషినెరీలు తిరగడానికి లేకుండా పోయింది. ఆ బాలికలోనుండి దయ్యాన్ని వెళ్లగొట్టినందున, ఆమె యజమానుల లాభం పోయింది, రోమీయుల చట్ట విరుద్ధమైన ఆచారాలను ప్రవేశపెట్టారన్న నేరంమీద పౌలు సీలలు కొరడాలతో కొట్టబడి చెరసాలలో

వేయబడ్డారు. మధ్యరాత్రి వేళ వారి పాటలు, వారున్న చెరసాల ద్వారాలను తెరిచిన భూకంపము, చెరసాల నాయకుని వారియెదుటికి మోకాళ్లమీద వచ్చేలా చేసింది. ఆ రాత్రి యింకను తెల్లవారక ముందే అతడును అతని యింటి వారందరును బాప్తిస్మం పొందిన విశ్వాసులుగా దేవునియందు ఆనందించారు.

**5. ఫిలిప్పీనుండి ఏథెన్సుకు.** – బాల్య దశలో ఉన్న సంఘాన్ని లూకా, ఒకవేళ తిమోతికి అప్పగించి, నల్ల సముద్రాన్ని అడ్రియాటిక్‌ను కలిపే ఇజ్ఞేషియా గుండా (*Via Egnatia*) అనే గొప్ప మిలిటరీ రాజ మార్గం గుండా వారు తూర్పువైపుకు పయనించారు. అంఫిపోలి, అపొల్లోనియ పట్టణముల మీదుగా వారు థెస్సలొనీకకు వచ్చారు. అది మాసిదోనియకు (మెట్రో పోలిస్) ప్రధాన నగరం. ఇక్కడ పౌలు, “తన వాడుక చొప్పున” (అపొ. 17:2) సమాజమందిరములో కొన్ని విశ్రాంతి దినాలు క్రీస్తును గూర్చి ప్రకటించాడు. కొద్ది మంది యూదులును, అనేకమంది గ్రీకువారును విశ్వాసముంచారు; కాని నమ్మని యూదులు, తమ పద్ధతి చొప్పున, హింస అనే తుఫానును లేపారు. దానిని బట్టి మిషినెరీలు బెరయ పట్టణానికి పారిపోయారు. థెస్సలొనీకయులకంటె ఘనులైన బెరయ యూదులు అనుదినము లేఖనాలను పరిశీలించారు. యూదులును గ్రీకు దేశస్థులును అధిక సంఖ్యలో మారారు. థెస్సలొనీకనుండి యూదులు బెరయకు వచ్చి అల్లరి లేపి జనసమూహాన్ని కలవరపరచారు. సముద్రం దగ్గరకు వెళ్లి పౌలు ఏథెన్సుకు ప్రయాణం చేశాడు.

**6. ఏథెన్సులో పౌలు.** – ప్రామాణికమైన చరిత్రలో ప్రధానమైన భాగాన్ని ఏథెన్సు వహించినట్టు క్రైస్తవ చరిత్రలో అది ఎన్నడు వహించలేదు. ప్రాచీన ఏథెన్సు మహిమ సిలువ యొక్క శ్రేష్ఠమైన ఆత్మ సంబంధమైన మహిమను ఎదుర్కొన్నప్పుడు లోతుగా ఆసక్తిని పెంచుకొనే క్షణాలు వచ్చాయి. ఏథెన్సులో తన్ను కలిసికోవలసిందిగా సీలకును, తిమోతికిని పౌలు వర్తమానం పంపాడు. ఈ మధ్య కాలంలో తన చుట్టు కన్పిస్తున్న దేవతా ప్రతిమలను అతడు చూచి పరితాపము పట్టలేక, యూదుల సమాజమందిరంలోను, అగోరాలోను అంటే పట్టణం యొక్క బహిరంగ సభలో తన క్రొత్త విశ్వాసాన్ని ప్రకటించాడు. కొందరు తాత్వికుల కుతూహలం రేకెత్తించబడింది, అరేయోపగు అను చోటుకి పౌలును తోడుకొని పోయారు. అక్కడ బహు గౌరవనీయులును పండితులును కూర్చుండియున్నారు. చరిత్ర అనుబంధంలో ఎంతో విలువగలదైయున్న, అచ్చోట, పౌలు గొప్ప ప్రసంగాల్లో, మనకు లభించిన వాటిలో రెండవదాన్ని చేశాడు. మొదటి దానికిని, రెండవ దానికిని చెప్పుకోదగిన వ్యత్యాసాలున్నాయి (అపొ. 13:16–41), జాతీయ చరిత్ర, గంభీరమైన ప్రవచనాల విషయంలో అతిశయించే యూదులకు అంతియొకయ సమాజమందిరములో మొదటిది ప్రసంగించబడింది. ఈ రెండవది, నాగరికులైన గ్రీకుల సమక్షంలో ఏథెన్సులో అరేయొపగు అను వేదికపైనుండి. ఈ రెండింటిలో వాదించే విధానం వేరుగా ఉన్నా, అంతం ఒక్కటే – సిలువ వేయబడిన క్రీస్తును, క్రీస్తు మరియు పునరుత్థానం. అయితే యూదులు ఎంతగా తమ పారంపర్యాలకు కట్టుబడియున్నారో నాగరికులైన ఏథెన్సువారు అంతగా తమ తత్వ శాస్త్రంచేత ముడివేయబడియున్నారు. అయినా, కొద్దిమంది క్రీస్తు కొరకు జయింపబడ్డారు. వారిలో అరేయొపగు న్యాయమూర్తి ఒకడైన డియొనిసియస్ అనేవాడును, డమారియస్ స్త్రీయు ఉన్నారు. అపొ. 17:15, 16లను 1 థెస్స. 3:1తో

పోల్చితే, తిమోతి పౌలును ఏథెన్సులో కలిసికొన్నట్టు తెలుస్తుంది, అతడు తిరిగి థెస్సలొనీకకు వెళ్ళాడు. పౌలు హింస పెట్టబడని కొన్ని పట్టణాలలో ఏథెన్సు ఒకటి; అయితే అది ఫలితం లేని నేల. గనుక అతడు త్వరలోనే కొరింథుకు వెళ్లిపోయాడు.

**7. పౌలు చాలా కాలం కొరింథులో ఉంటాడు.** – పౌలు దినాల్లో కొరింథు బోస్టన్ వంటిది, అది గ్రీసు యొక్క న్యూయార్క్ అయ్యింది. ఈ గొప్ప వర్తకపు ప్రధాన నగరానికి పౌలు భయముతోను వణకుతోను ప్రవేశించాడు (1 కొరింథీ. 2:3), ఏథెన్సులో ఫలరహితు డైనందున బలహీనపడినట్టున్నాడు. పైసా లేకుండా అతడు ఒంటరి వాడుగా ఉన్నాడు. తన అనుదిన భోజనం కొరకు తన వృత్తియైన డేరాలు కుట్టడానికి సిద్ధపడ్డాడు. స్నేహితులను కనుగొనడంలో గాని, చేసికొనడంలో గాని పౌలుకు ఎక్కువ కాలం అవసరముండదు. అకుల ప్రిస్కిల్ల అనే తన సొంత వృత్తి గలవారి మధ్య అనుకూలమైన స్వభావం ఉన్నట్టు కనుగొన్నాడు, వారు త్వరలోనే శిష్యులుగా చేయబడ్డారు, వారు అంతకు ముందు అలాగైయుండక ఉన్నట్టయితే. వారమంతా వారితో పనిచేసి, సమాజ మందిరములో సబ్బాతు దినాన ప్రసంగించేవాడు. సీల తిమోతీలు ఫిలిప్పీనుండి ఉపకార ద్రవ్యాన్ని తెచ్చినప్పుడు, అతని చేతులు విడిపించబడ్డాయి; ఒక సంవత్సరం ఆరు నెలలు వారి మధ్య దేవుని వాక్యము బోధించుచు నివసించాడు (అపొ. 18:5, 9, 10; ఫిలిప్పీ. 4:15 పోల్చి చూడు). తిమోతి తిరిగి వచ్చిన తరువాత, పౌలు థెస్సలొనీకయులకు తన మొదటి పత్రికను వ్రాశాడు (1 థెస్స. 3:6), మరి కొంత కాలం తరువాత రెండవ పత్రిక. పౌలు వ్రాసిన తొలి పత్రికలలో మనకు లభించినవి యివి.

**8. అంతియొకయకు తిరిగి వచ్చుట.** – కొరింథు యొక్క ఇస్త్మసును దాటి అకుల ప్రిస్కిల్లలతో పాటు అతడు కెంక్రేయకు వస్తాడు, పౌలు అక్కడనుండి ఓడలో ఎఫెసుకు వచ్చి చేరుకుంటాడు. అక్కడ సమాజమందిరములో పౌలు వర్తమానాన్ని విన్నవారు ఎంతగా ఆకర్షింపబడ్డారంటే, అక్కడ ఆగి పొమ్మని వారు పౌలును కోరారు. తిరిగి వస్తాననే వాగ్దానంతో కైసరయకు, అటు తరువాత అంతియొకయకు వచ్చాడు. ఇలాగున పౌలు కావించిన విశాలమైన రెండవ సువార్త ప్రయాణం ముగిసింది. ఆసక్తికరమైన విషయ మేమంటే, యూరప్‌కు మార్చబడడమే, కడకు అది రోము వద్ద కేంద్రీకృతమౌతుంది.

## III. మూడవ ప్రయాణం. (అపొ. 18:23-21:26.)

**1. ఎఫెసులో పౌలు యొక్క మూడు సంవత్సరాలు.** – అంతియొకయలో కొంతకాలం గడిపిన పిమ్మట, గొప్ప మిషనెరీ సంఘానికి చివరిగా పౌలు వీడ్కోలు పలికాడు. అతడు దాడి చేయబోయే తరువాత స్థానము ఎఫెసు. మూడవ ప్రయాణానికి ఆసక్తికరమైన కేంద్రం ఎఫెసు. సిరియాకు అంతియొకయ; గ్రీసుకు కొరింథు; రోముకు, పడమరకు ఇటలీ ఎలాటిదో, పశ్చిమ చిన్న ఆసియా యొక్క చురుకుగానుండే జీవిత విధానానికి ఎఫెసు అలాటిది. ఎఫెసునకు వెళ్లే అతని మార్గంలో, గలతీయ, ఫ్రుగియలగుండ ముందటి త్రోవను త్వరగా చుట్టి వచ్చాడు. కొరింథునుండి అంతియొకయకు వెళ్లిన తన సముద్ర యానంలో జనులు వాటిని తెలిసికొనగలిగినంతమట్టుకు అతడు ఎఫెసును తాకినాడని,

అక్కడ అకుల, ప్రిస్కిల్లను పౌలు విడిచి వచ్చాడని గుర్తుంచుకోవాలి. తానులేని ఆ కాలంలో సిద్ధపాటు పని జరుగుతుంది. అలెగ్జాంద్రియా వాడైన అపొల్లో అనే వాగ్ధాటిగల యూదుడు ఎఫెసునకు వచ్చి, యోహాను బాప్తిస్మమును గొప్ప బలంగా ప్రకటిస్తున్నాడు. సువార్త యందు అకుల ప్రిస్కిల్లలు అతనికి పరిపూర్ణంగా బోధించారు. అప్పుడు అపొల్లో కొరింథుకు దాటి వెళ్లి, విజయవంతంగా పౌలు ప్రారంభించిన పనిని అతడు ముందుకు తీసికొని వెళ్లుతున్నాడు (అపొ. 18:27; 1 కొరింథీ. 3:4–7లను పోల్చి చూడు). తాను ఎఫెసునకు వచ్చిన తరువాత మూడు నెలలవరకు పౌలు సమాజమందిరములో బోధించాడు. యూదులనుండి విడిపోవలసినదిగాను క్రైస్తవులను ప్రత్యేకమైన సమాజంగా వృద్ధి పరచునట్లుగాను అతడు బలవంతపెట్టబడ్డాడు. రెండు సంవత్సరాల కాలము తురన్ను అను ఒకని పాఠశాలలో అనుదినము బోధించాడు, ఆసియాలో ఉన్న అన్ని భాగాలవారు యూదులేమి గ్రీసు దేశస్థులేమి జన సమూహాలకు ఆ వర్తమానం అందింపబడింది. అర్తమిదేవి యొక్క వెండి బొమ్మలు చేసి విక్రయించే పరిశ్రమ ఎఫెసులో పడిపోవునంత గొప్ప శక్తివంతంగా పౌలు యొక్క పరిచర్య కొనసాగింది. ఈ వెండి పనివారి మూక పౌలు యొక్క ప్రాణాన్ని ఆపదలో ఉంచేలా చేశారు. పౌలు ఎఫెసులో ఉన్న ఆ దీర్ఘకాలంలో అతడు కొరింథును సందర్శించియుండవచ్చు (2 కొరింథీ. 12:14; 13:1లను పోల్చి చూడు). కొరింథీయులకు తన తొలి పత్రికను కూడా అతడు (యిక్కడనుండే) వ్రాశాడు (1 కొరింథీ. 16:5–9; అపొ. 19:20, 21; 20:1). వారు కూడా తనకు ఉత్తరం వ్రాశారు (1 కొరింథీ. 7:1), అతడు వారి కొకటి వ్రాశాడు (1 కొరింథీ. 5:9), ఆ రెండింటిలో ఏదీ మన యొద్దకు రాలేదు.

**2. రెండవ ప్రయాణం మాసిదోనియ, అకయలలో.** – ఏజియన్‌ను మరోసారి దాటి, పౌలు రెండవ యూరోపియన్ టూర్ చేశాడు, దాన్ని గూర్చి మనకు కొద్ది వివరాలే ఉన్నాయి. 2 కొరింథీ. 1:8–10 మరియు 2:12, 13లను అపొ. 20:2తో పోల్చితే, మాసిదోనియ గుండా చేస్తున్న ప్రయాణంలో ఏదో యొక స్థలంనుండి కొరింథీయులకు రెండవ ఉత్తరం వ్రాసియున్నట్టు స్పష్టమౌతుంది. కొరింథుకు వెళ్లి అక్కడ అతడు మూడు మాసాలు గడిపాడు. ఆ కాలంలో అతడు రోమీయులకు పత్రిక వ్రాశాడు (రోమా 15:25, 26; అపొ. 20:3, 4; 24:17లను పోల్చి చూడు) దాదాపుగా కెంక్రేయలోని ఫీబే ద్వారా దానిని పంపియుండవచ్చు (రోమా 16:1). ఈ మూడవ ప్రయాణంలో కొరింథులోనుండి గాని లేదా ముందుగా ఎఫెసునుండి గాని; ఏదో ఒక స్థలంనుండి గలతీయులకు పత్రిక వ్రాశాడు.

**3. ఉపకార ద్రవ్యం.** – యూదులు అన్యజనులనేవారి మధ్య నిలిచిన ఆ మధ్య గోడ పడగొట్టబడాలనేది పౌలు కోర్కె. ఆ అంతం తన హృదయానికి సమీపంగా నిలిచియుంది. తన గొప్ప జీవితాన్ని దానికొరకే అప్పగించుకున్నాడు. ఈ విషయంలో తాను ఉపయోగించిన ఒక విధానం – యూదుల మధ్య యెరూషలేములో పేదలైన సహోదరుల కొరకు అన్యజనుల మధ్యనున్న సహోదరుల వద్దనుండి ఉపకార ద్రవ్యాన్ని పోగుచేయ సంచరించడమే. కొన్ని క్లుప్తమైన లేఖన భాగాలతో పాటు 2 కొరింథీలోని ఎనిమిది, తొమ్మిది అధ్యాయాలు ఈ విషయాన్ని తెలుపుతూ ఉంటాయి. అది గలతీయ, మాసిదోనియ, అకయలలో సమకూర్చ

బడింది (1 కొరింథీ. 16:1–3; గలతీ. 2:10; రోమా 15:25, 26; అపొ. 24:17లను పోల్చి చూడు); వారంలో మొదటి దినాన (1 కొరింథీ. 16:1); దానికి తోడు వ్యక్తిగతంగాను, పత్రికల ద్వారా విన్నవించుతూ, ఈ ద్రవ్యం సమకూర్చి పంపడానికిగాను తీతును యింకా యితరులను అతడు నియమించాడు (2 కొరింథీ. 8:6, 18, 23; 1 కొరింథీ. 16:3).

**4. తిరిగి వచ్చే సముద్రయానం.** – కొరింథునుండి పౌలు నేరుగా సిరియా రావాలని ఉద్దేశించాడు; కాని వివరింపబడని యూదుల కుట్రలు మాసిదోనియ గుండా అతని నడిపించాయి. క్రొత్త, పాత స్నేహితుల సమాజము అతన్ని మాసిదోనియలో కలిసికొంది (అపొ. 20:4–6), అందులో తిమోతి, లూకాలు కూడా ఉన్నారు. ఫిలిప్పీని తొలిగా దర్శించినది మొదలు లూకా అక్కడే నిలిచియుండి ఉండవచ్చు. (అపొ. 16:10, 13, 40; 20:6లో ప్రయోగించిన “వారు”, “మేము” అనే పదాలను పోల్చి చూడు). ఆ సమాజం ఒకవారం త్రోయలో గడిపింది, ఆదివారం రొట్టె విరచడానికి కూడివచ్చే శిష్యులతో వారు కలిసికున్నారు (అపొ. 20:7). ఈ లేఖన భాగం ఈ క్రింద చూపబడినట్టు ప్రాముఖ్యమైనది: (1) శిష్యులు ఆచరించిన దినమది; (2) దాన్ని అనుసరించిన విధానమది. ఐతుకును పౌలు బ్రతికించినది యిక్కడే – పౌలు ప్రసంగించినప్పుడు అతడు కిటికీలో నుండి పడి చచ్చిపోయాడు. పెంతెకొస్తుకు ముందు యెరూషలేముకు చేరాలనే తొందరలో పౌలు ఎఫెసులో ఆగలేదు, కాని ఎఫెసునందలి పెద్దలను అతడు మిలేతులో కలిసి కొంటాడు, పౌలు అక్కడ వారికి బహు రమ్యమైన ఉపన్యాసం చేశాడు. సువార్త త్వరగా వ్యాపించడానికి అదియొక మనోహరమైన ఉదాహరణయైయుంది. త్రోయ, మిలేతు, తూరు, తొలెమాయి, సముద్రం అంతమయిన కైసరయల్లో వారు ఎక్కడ ఆగినా అక్కడ వారు శిష్యులను కనుగొన్నారు. ఇక్కడ మేము మా పాత స్నేహితుడైన ఫిలిప్పును కలిసికొన్నాం (అపొ. 8:40). దైవ ప్రేరేపణతో ఉపదేశించే నలుగురు కుమార్తెలు అతనికున్నారు. యెరూషలేములో పౌలుకొరకు కాచుకొనియున్న శ్రమలను గూర్చి తూరులోను కైసరయలోను అతడు హెచ్చరింపబడ్డాడు. యూదులకు అన్యజనుల యొద్దనుండి తాను తెస్తున్న సమాధాన బలిని వారికి అర్పించేవరకు ఏదీ తన దృఢ సంకల్పాన్ని మార్చలేవు. నాల్గు సంవత్సరాలుగా అది అతడు పోగు చేశాడు.

**5. యెరూషలేములో పౌలుకు స్వాగతం.** – పౌలు మార్పుపొంది యిప్పటికి యిరవై సంవత్సరాలయ్యింది. పన్నెండు సంవత్సరాలపాటు అన్యజనులుండే గొప్ప కేంద్రాలలో సువార్తను నాటడంలో తీవ్రంగా పని కలిగియున్నాడు. రెండు, మూడు సార్లు అవసరతను బట్టి యెరూషలేముకు సత్వర సందర్శనాలు జరిగించాడు. పన్నెండు లేక అంతకంటే ఎక్కువ సంవత్సరాలలో టైటస్[1] దాని గోడలను కూల్చనైయున్నాడు. మరోసారి పౌలు అన్యజనులలోనుండి విశ్వాసులైన సహోదరులనుండి దేవుని కృపా సువార్తవలన ప్రేరేపింపబడిన ఉపకార ద్రవ్యాన్ని తీసికొని పౌలు మరోసారి వస్తాడు. వారు అతన్ని ఎలా స్వీకరిస్తారు? యాకోబు ఆధ్వర్యంలో యెరూషలేములోని సంఘ నాయకులు హృదయపూర్వకంగా ఆహ్వానించారు. అన్ని చోట్ల జరిగినట్లే అక్కడ కూడ అతడు అవమానానికి గురియయ్యాడు. దాన్ని శాంతిపరచుకొనడానికి గాను, పౌలు యాకోబు సలహామేరకు, యూదుల వ్రత సంబంధమైన కొన్ని ఆచారాలను అతడు జరిగించాడు.

సంఘంలోనికి అవి ఎలాగు వచ్చాయనే సంగతి లూకా మనకు చెప్పలేదు. అవిశ్వాసులైన యూదులను అది శాంతిపరచలేక పోయింది. స్తెఫనుకు తానెలా ముందు వచ్చాడో, అలాగే అల్లరి మూక త్వరలోనే దేవాలయంలో పౌలును పట్టుకున్నారు.

---

సూచన

[1]టైటస్ ఫ్లేవియస్ వెస్పేనియనస్ రోమా చక్రవర్తి.